ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తులసీదాస్

ఆదుకుంటున్న 'ఉపాధి'

- పనుల్లేక పట్టణాలకు యువత వలస
- పట్టణాల్లో మహిళలు, వృద్ధులకు దొరకని పనులు
- గ్రామాల్లో ఉపాధి హామీ పనులే దిక్కు

జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో, గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు పనుల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. కొంతమంది పట్టణాలకు వచ్చి హోటళ్లు, భవన నిర్మాణ పనులు, అవీ దొరక్క కొందరు కూలి పనులు చేసుకుంటున్నారు. దుకాణాలు, షాపింగ్‌మాల్స్, హోటళ్లలో పని కావాలని అడుగుతున్న కొందరికి చీదరింపులే ఎదురవుతున్నాయి. బరువులు ఎత్తలేవు, వయసు అయిపోంది, ఇంకా ఏం పని చేస్తావంటూ పని ఇచ్చేందుకు యజమానులు నిరాకరిస్తున్నారు. పట్టణాల్లో పని దొరక్క నిరాశతో వెనుదిరుగుతున్న వారికి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు కొండంత ధైర్యాన్ని ఇస్తున్నాయి. ఉపాధి హామీ పనులు వారిని ఆదుకుంటున్నాయి. ఇటువంటి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు రకారకాల షరతులు పెట్టడంపై కూలీల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 4.32 లక్షల మందికి జాబ్‌కార్డులు జారీ చేయగా, వాటిలో 3.78 లక్షల కార్డులు మనుగడలో ఉన్నాయి. మొత్తం 7.49 లక్షల మంది కూలీలకు గానూ ఏడాదిలో 6.08 లక్షల మంది చురుగ్గా పనుల్లోకి వస్తున్నారు. ప్రస్తుతం చేపడుతున్న ఉపాధి హామీ పనులకు 2.50 లక్షల మందికి పైగా హాజరవుతున్నారు. ఇందులో మహిళలే అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. పురుషులు సమీప పట్టణాలకు వెళ్లి రకరకాల పనులు చేస్తూ ఆదాయం తెస్తున్నా సరిపోవడం లేదు. దీంతో గ్రామాల్లో చేపడుతున్న వస్తున్నారు. వీరితోపాటు 50 ఏళ్లు పైబడిన వారూ ఎక్కువ మంది పనుల్లో ఉంటున్నారు. కొడుకులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవడంతో చేసేది లేక కొంతమంది అందరితో పాటే పనులకు వస్తున్నారు. ఉపాధి పనుల ద్వారా వచ్చిన డబ్బులతో కాస్తా గంజి నీళ్లు కాచుకుని బతుకీడుస్తున్నారు.

కేంద్రం శరతులతో కూలీలకు ఇక్కట్లు

గ్రామీణ ప్రాంతాల్లో ఈ సీజన్‌లో 80 శాతం మందికి జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోంది. రకరకాల షరతులను పెడుతోంది. ఈ-మస్టరు పేరుతో మొబైల్ ద్వారా మస్టర్లు వేయించడం, ఫేషియల్ అటెండెన్స్ వంటి విధానాలతో కూలీలను పనులకు దూరం చేసే విధానాలను అవలంభిస్తోంది. ఉపాధి కూలీలకు అదనంగా చెల్లించే వేసవిభృతిని రెండేళ్లుగా కేంద్రం ఆపేసింది. 2020-21 వరకు ఉపాధి హామీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) టెక్నాలజీని వినియోగించేది. దేశవ్యాప్తంగా ఒకటే విధానం ఉండాలన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో 2021-22 ఉంచి ఎపిని కూడా ఎన్ఐసి (నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో కూలీలకు అప్పటివరకు అందుతున్న సౌకర్యాలన్నీ ఆగిపోయాయి. వీటిలో వేసవి భత్యం ప్రధానమైంది. ఫిబ్రవరిలో అదనంగా 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం చొప్పున చెల్లించేవారు. ఎండలతో భూమి గట్టి పడడం, వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల్లో పనిచేయడం కష్టంగా ఉంటుందని వేసవి భత్యం కింద అదనంగా చెల్లించేవారు. వేసవిలో పనికి హాజరయ్యే కూలీలకు గతంలో మజ్జిగ కోసం రోజుకు రూ.5 చొప్పున అదనంగా చెల్లించేవారు. రెండేళ్లుగా దాన్నీ నిలిపేశారు. సాధారణ రోజుల్లో తాగునీటి కోసం రూ.5 చొప్పున చెల్లించే విధానాన్ని ఎత్తేసింది.

ఒకవైపు ఆకలి బాధ... మరోవైపు వడదెబ్బ

నీడనిచ్చేందుకు టార్పాలిన్లు వేసవిలో పని ప్రదేశాల్లో తగిన సదుపాయాల్లేక కూలీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పని ప్రాంతాల్లో ఎక్కడా టార్పాలిన్లు కనిపించడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. 40 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చెమటలు కక్కుతున్నారు. వడదెబ్బ బారిన పడి ఇప్పటికే జిల్లాలో నలుగురు మృత్యువాత పడ్డారు. దీంతో కొందరి కూలీలు వెనకడుగు వేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇంట్లో ఉంటే ఆకలి బాధ, పనుల్లోకి వెళ్తే వడదెబ్బ అన్నట్లుగా వారి పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ చట్టం అమల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కూలీ డబ్బులే మాకు ఆధారం

మా పిల్లలు వేరే ఊరులో ఉంటున్నారు. నేను, నా భార్య ఇక్కడే ఉంటూ గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులకు వస్తున్నాను. వయసు 60 ఏళ్లు దాటిపోవడంతో వ్యవసాయ పనులకు ఎవరూ పిలవడం లేదు. ఉపాధి పనులు చేయగా వచ్చిన డబ్బులతో కలో గంజి తాగుతున్నాం.

- ఎచ్చెర్ల చిన్నవాడు, ఆడవరం, గార

ఇంటి ఖర్చులకు కోసం రావాల్సి వస్తోంది

నాకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు శ్రీకాకుళంలో ఆటో నడుపుతున్నాడు. చిన్న కొడుకు కూలి పనులు చేస్తున్నాడు. వారి సంపాదనతో ఇల్లు గడవడం కొంత కష్టంగా ఉంది. ఉపాధి పనులు చేస్తే వేడినీళ్లకు చన్నీళ్లుగా ఉపయోగపడతాయని అందరితో పాటు పనుల్లోకి వచ్చాను.

- వి.చిన్నమ్మడు, ఆడవరం, గార

'ఉపాధి' ఎత్తివేతకు మోడీ ప్లాన్

- సాంకేతికత పేరుతో కూలీల పొట్ట కొడుతున్న కేంద్రం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఫేషియల్ హాజరు, మొబైల్‌లో మస్టర్లు వంటి సాంకేతిక అంశాలతో ఉపాధి హామీని ఎత్తివేసేందుకు మోడీ ప్లాన్ చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. ఎచ్చెర్ల మండలం పొన్నాడ సమీపంలోని కవి చెరువులో ఉపాధి పనులను పరిశీలించి, అనంతరం కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధి ఫేషియల్ హాజరు పద్ధతిలో అటెండెన్స్ సరిగా నమోదు కాక కూలీలు పనులకు వస్తున్నా డబ్బులు రావడం లేదన్నారు. సాంకేతిక సమస్యలతో మొబైల్‌లో మస్టర్లు సరిగా పడకపోవడంతో కూలి సొమ్ములు నష్టపోతున్నారని చెప్పారు. మోడీ దుర్మార్గమైన షరతులను అంతా వ్యతిరేకించాలన్నారు. ఉపాధి చట్టం ప్రకారం కూలీలకు కల్పించాల్సిన సౌకర్యాలనూ కల్పించడం లేదని విమర్శించారు. గ్రామాల్లో 80 శాతం మందికి ఉపాధి హామీ జీవనాధారంగా ఉందని, అటువంటి చట్టాన్ని ఎత్తేసి కూలీల కడుపు కొట్టాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. గతంలో కూలీలు మాత్రమే పనుల్లోకి వచ్చేవారని, ఇప్పుడు రైతులు, పేద రైతులూ పనులకు వస్తున్నారని చెప్పారు. జనాభా, అవసరాలు పెరుగుతుంటే అందుకనుగుణంగా ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిన మోడీ ప్రభుత్వం నిధులకు కోత పెడుతోందని విమర్శించారు. గతంలో కూలీలు మాత్రమే పనుల్లోకి వచ్చేవారని, ఇప్పుడు రైతులు, పేద రైతులూ పనులకు వస్తున్నారని చెప్పారు.

25న ధర్నాకు తరలి రావాలి

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మోడీ ఏది చెప్తే అది చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించాలని మోడీ చెప్తే జగన్ అమలు చేశారని చెప్పారు. రాష్ట్రంలో గృహ విద్యుత్ కనెక్షన్లకు అదానీ కంపెనీ సరఫరా చేస్తున్న స్మార్ట్‌మీటర్లు అమర్చాలని మోడీ సూచిస్తే, మారుమాట్లడకుండా దాన్నీ అమలు చేస్తున్నారని చెప్పారు. మోడీ విధానాలే సరైనవంటూ చంద్రబాబు తాళం వేస్తున్నారని చెప్పారు. పవన్ కళ్యాణ్, మోడీ జత కట్టి వెళ్తున్నారని విమర్శించారు. మూడు పార్టీల పద్ధతులను ప్రజలు ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో లభ్యమవుతున్న గ్యాస్‌ను రాష్ట్ర అవసరాలకు ముందు ఇచ్చిన తర్వాతే గుజరాత్‌కు ఇవ్వాలని కీ.శే వైఎస్ రాజశేఖర్ రెడ్డి నాడు సోనియాగాంధీ వద్ద తెగువ చూపితే, నేడు ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి మోడీ ముందు మోకరిల్లుతున్నారని విమర్శించారు. పేదలకు కిలో బియ్యం, పక్కా ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను కీ.శే ఎన్‌టిఆర్ అమలు చేస్తే నేడు మోడీ విధానాలతో పేదలకు నష్టపోతున్నా చంద్రబాబు ప్రశ్నించడం లేదని విమర్శించారు. జనం ఐక్యంగా ఉంటేనే మోడీ దిగి వస్తాడని చెప్పారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం ఈనెల 25న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు కూలీలకు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

శ్రీకాకుళం అర్బన్ : ఈనెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 71 పరీక్షా కేంద్రాల్లో జనరల్, ఒకేషనల్ కలిపి 25,714 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు వివరించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, ఇతర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

పాలిసెట్‌లో శ్రీకర్‌కు 16వ ర్యాంకు

పరీక్షల్లో 86.67 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

శ్రీకర్ కశ్యప్

విక్రమ్ రాజా

పాలిసెట్ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. కాశీబుగ్గకు చెందిన లఖినాన శ్రీకర్ కశ్యప్‌కు 120 మార్కులకు గానూ 119 మార్కులు సాధించి 16వ ర్యాంకు సాధించాడు. ఆయన తండ్రి లఖినాన వెంకటాచలం, తల్లి శ్రీదేవి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఎచ్చెర్ల మండలం అల్లినగరానికి చెందిన బుడుమూరు విక్రమ్ రాజా 37వ ర్యాంకు సాధించాడు. మొత్తం 120 మార్కులకు గానూ 119 వచ్చాయి. ఆయన తండ్రి సోమరాజు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. తల్లి కళ్యాణి గృహిణి.

పరీక్షలో 86.67 శాతం ఉత్తీర్ణత

పాలిసెట్ పరీక్షలో మొత్తం 86.67 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్షలకు 11,198 మంది హాజరు కాగా 9,705 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయిగా ఉంది. బాలికల్లో 4,695 మంది పరీక్షలు రాయగా 4,171 మంది (88.84 శాతం) పాస్ అయ్యారు. 6,503 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా 5,534 మంది (85.10 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

సమాజాభివద్ధిలో యువత పాత్ర చాలా కీలకమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ఎస్‌పి జి.ఆర్ రాధిక రూపొందించిన జాగృతి - యువత కోసం ఐదు రోజుల శిక్షణా ముగింపు కార్యక్రమాన్ని స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జాగృతి కార్యక్రమాలు ఆదర్శవంతంగా ఉన్నాయని అభినందించారు. ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ నేరాల్లేని జిల్లాగా సిక్కోలును తీర్చిదిద్దడమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమన్నారు. అందుకనుగుణంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. యువత క్షణికావేశంలో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు వారి జీవితాన్ని అంధకారంలోకి నెడుతోందన్నారు. పోక్సో చట్టం, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, దొంగతనాలు, అక్రమ రవాణా, వాహన ప్రమాదాలు, ఈవ్ టీజింగ్, అభ్యంతరకర సోషల్ మీడియా పోస్టులు వంటి అంశాలపై యువత అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు.

జాగృతి కార్యక్రమంలో శిక్షణ పొందిన యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడ శాంతిభద్రతల సమస్యలు తక్కువగా ఉంటాయో అక్కడ విద్య, ఉద్యోగాలకు ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. టెక్కలి పోలీస్ డివిజన్ పరిధిలో శిక్షణకు హాజరైన 144 మంది నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలను కలెక్టర్, ఎస్‌పి అందజేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి డి.బాలచంద్రారెడ్డి, సిఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ ఎల్.రామకృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహనా కార్యక్రమాలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో క్షయ (టిబి) వ్యాధి నిర్మూలనకు పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వైద్యాధికారులకు సూచించారు. జాతీయ క్షయ నిర్ములనా కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి టిబి ముక్త్ పంచాయత్‌పై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సమావేశం నిర్వహించారు. టిబి నిర్మూలనకు పంచాయతీల వారీగా చేపడుతున్న వివరాలను తెలుసుకున్నారు. టిబి నిర్మూలనకు అవసరమైన ఆర్థిక నివేదికలను అందజేయాలన్నారు. క్షయ నివారణ అధికారి అనురాధ మాట్లాడుతూ 2015 నుంచి టిబి కేసులు తగ్గాయని తెలిపారు. టిబి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. క్షయ నిర్మూలనకు పంచాయతీ స్థాయిలో చేపట్టే పనులకు గానూ పంచాయతీ శాఖ సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, డిసిహెచ్ఎస్ జె.భాస్కరరావు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ పి.జగన్మోహనరావు, రిమ్స్, జెమ్స్ వైద్యాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. గ్రేవ్, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, పోక్సో తదితర కేసుల దర్యాప్తుపై సబ్ డివిజన్, సర్కిల్ వారీ పోలీసు అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల తనిఖీలు క్షుణ్ణంగా చేపట్టాలన్నారు. ట్రాన్స్‌పోర్టు, పార్శిల్ సర్వీస్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి, ప్రతి లగేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం రవాణాకు అనుమతించాలని స్పష్టం చేశారు. ప్రయివేటు వాహనాలు, రైల్వే, బస్ స్టేషన్లలో నిరంతరం వాహనాలు తనిఖీ చేసి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని తెలిపారు. పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం

తీవ్రమైన (గ్రేవ్) నేరాల్లో సమగ్ర దర్యాప్తుతో కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాపర్టీ, గ్రేవ్ నేరాలపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. నేరాల నివారణకు సబ్ డివిజన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి గస్తీలను బలోపేతం చేసి అధికారులు తరచుగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. కేసుల పూర్తి వివరాలను సిసిటిఎన్ఎస్ అప్లికేషన్‌లో నమోదు చేయాలని చెప్పారు. కేసుల నమోదు, దర్యాప్తు, నిందితుల అరెస్టు, ఛార్జిషీట్ దాఖలు వరకు సమగ్ర విచారణ చేయాలని సూచించారు. నేరాల నివారణ, నేరస్తులను గుర్తించడానికి సిసి కెమెరాలు దోహదపడతాయన్నారు. అన్ని ముఖ్య కూడళ్లు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు, ఆలయాల వద్ద సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పిలు డి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, జి.నాగేశ్వరరెడ్డి, ఎస్.వాసుదేవ్, ఎస్.బాలరాజు, సిఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్
- ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి, ఇద్దరు పిహెచ్‌సి వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు

శ్రీకాకుళం అర్బన్ : విధి నిర్వహణలో, లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, క్రమశిక్షణా చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హెచ్చరించారు. 27 పిహెచ్‌సిల వైద్యులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పిహెచ్‌సిల పనుల నిర్వహణపై ఆరా తీశారు. కొర్లాం, సారవకోట, తాడివలస, బెలగాం, కొలిగాం, సింగుపురం, మాణిక్యపురం, బైదిలాపురం, మెట్టక్కివలస, చొర్లంగి పిహెచ్‌సిల్లో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలను ప్రోత్సహించడం, సుఖ ప్రసవాలు చేయడం, ప్రణాళికా ప్రకారం ఇమ్యునైజేషన్ వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టడం, మాతా శిశు మరణాల నివారణ తదితర వాటిలో పురోగతి లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

కురిగాం, మాణిక్యపురం పిహెచ్‌సిల్లో ఎన్‌డిసి సర్వే నివేదికలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోవడం, సంబంధిత వైద్యాధికారుల నుంచి నివేదికలు కోరడంలో అలసత్వం వహించారని ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి లక్ష్మీతులసికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షిని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల్లో వెనుకబడిన వెనుకబడ్డ సారవకోట, తాడివలస పిహెచ్‌సి వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. గ్రామస్థాయిలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ అనురాధ, డిసిహెచ్ఎస్ జె.భాస్కరరావు, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, అర్బన్ మెడికల్ ఆఫీసర్ జె.కృష్ణమోహన్, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త పి.ప్రకాశరావు, పిహెచ్‌సి వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకులాల పరీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాలకు 27 కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఐదు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉమ్మడి అడ్మిషన్ పరీక్ష (సిఎటి) నిర్వహించారు. జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు మధ్యాహ్నం 2.30 నుంచి ఐదు గంటల వరకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఐదో తరగతి ప్రవేశాలకు 1418 మంది దరఖాస్తు చేసుకోగా 1230 మంది హాజరయ్యారు.

ఆరో తరగతి కోసం 654 మంది దరఖాస్తు చేసుకోగా 513 మంది రాశారు. ఏడో తరగతి పరీక్షకు 50 మందికి గానూ 27 మంది హాజరయ్యారు. ఎనిమిదో తరగతిలో ప్రవేశానికి 149 మంది దరఖాస్తు చేసుకోగా 114 మంది రాశారు. ఇంటర్ (ఎపిఆర్‌జెసి)లో ప్రవేశానికి 6,199 మంది దరఖాస్తు చేసుకోగా 5,362 మంది హాజరయ్యారు. డిగ్రీ (ఎపిఆర్‌డిసి)లో ప్రవేశానికి 155 మందికి గానూ 122 మంది హాజరయ్యారు. పరీక్షలను డిఆర్ఒ రాజేశ్వరి పర్యవేక్షించారు. డిఇఒ తిరుమల చైతన్య, పరీక్షల కో-ఆర్డినేటర్ పి శ్రీనివాసరావు పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

'వై నాట్' ఎలా సాధ్యం?

వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి విజయం సాధించేందుకు వైనాట్ 175 అన్న రాజకీయ వ్యూహ నినాదంతో ముందుకు పోతున్న వైసిపికి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఏ వ్యూహంతో ఆ నినాదం ఇస్తున్నా, జిల్లాలో అందుకనుగుణంగా రాజకీయ పరిస్థితి లేదు. ప్రతి నియోజకవర్గంలో ఆశావహులు పెరుగుతున్నారు. గ్రూపుల పోరు కొనసాగుతోంది. జిల్లాలో ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నుంచి ఇద్దరు అభ్యర్థుల ప్రకటన వచ్చింది. మీకు పదవులు ఇచ్చాం. సాయిరాజ్‌ను గెలిపించుకు రావాలని నర్తు రామారావుకు ఇటీవల ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సమయంలో హెలీకాప్టర్ ఎక్కుతూ చెప్పిన విషయం తెలిసిందే. ఇచ్ఛాపురంలో పదవులు వచ్చినా ఆ నియోజకవర్గంలో అసమ్మతి చల్లారలేదు. ముఖ్యమంత్రి ప్రకటించిన తర్వాత నాకు టిక్కెట్ ఇస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని కాయల వెంకటరెడ్డి ప్రకటించిన వైనాన్ని చూశాం. ఆ నియోజకవర్గంలో సామాజిక తరగతుల మధ్య ఆధిపత్య పోరు ఎప్పట్నుంచో ఉంది. మరోవైపు ఒకే ప్రధాన సామాజిక తరగతిలో గ్రూపుల పోరు రాజ్యమేలుతోంది. పలాస నియోజకవర్గంలో ప్రత్యర్థుల బలం కంటే వైసిపి బలహీనంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఈసారి అభ్యర్థిని మార్చకపోతే మంత్రి అప్పలరాజుని ఓడిస్తామని ఆ పార్టీ నేతలే ప్రకటించిన పరిస్థితి ఉంది. సీనియర్లను విస్మరించి, కొత్తగా వచ్చిన వారిని ప్రాధాన్యత ఇస్తున్నారన్న అక్కసు ఆ పార్టీలో వెళ్లగక్కే పరిస్థితి ఉంది. మంత్రిపై పలురకాల ఆరోపణలు పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. టెక్కలి నియోజకవర్గ అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్‌ను ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో రెండుసార్లు ప్రకటించారు. అయినా ఇంటి పోరు, గ్రూపుల పోరు పూర్తిగా సమసిపోలేదు. ఇటీవల ఆయనకు సిఎం కార్యాలయం నుంచి ప్రత్యేకంగా పిలుపు రావడంతో వెళ్లి వచ్చినట్లు తెలిసింది. ఆశావహుల్లో, పదవుల కోసం ఎదురుచూస్తున్న వారిలోనూ అసంతృప్తి చోటుచేసుకుందని తెలిసింది. ఎన్నికల నాటికి ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాల్సి ఉంది.



పాతపట్నం నియోజకవర్గంలో గ్రూపుల పోరు తారాస్థాయికి చేరింది. రెడ్డి శాంతికి వ్యతిరేకంగా రెండు రోజుల కిందటే పెద్ద ప్రదర్శన చేపట్టారు. ఎమ్మెల్యే ఎవరినీ పట్టించుకోవడం లేదని, ఈసారి స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలన్న నినాదాన్ని మార్మోగిస్తున్నారు. గత చరిత్ర చూస్తే టిక్కెట్ మార్పు అంత తేలిక కాదని నేతలు గుర్తించినట్లు కనిపించడం లేదు. జగన్ రాజకీయ ప్రవేశంలో ఢిల్లీ వెళ్లినప్పుడుడల్లా ఎమ్మెల్యే శాంతి భర్త కీ.శే నాగభూషణరావు కార్యాలయాన్నే తన ఛాంబరుగా వాడుకునే వారని తెలిసింది. రెడ్డి శాంతి కొత్తగా రాజకీయ ప్రవేశం చేసి 2014 ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నప్పుడు నియోజకవర్గం మొత్తం ఆర్థిక వ్యవహారాలను ఆమె చేతిలో పెట్టినట్లు తెలిసింది. అంత విశ్వాసం ఉన్న కుటుంబాన్ని జగన్ అంత తేలిగ్గా వదులుకోలేరని ఆమె అనుయాయులు చెప్తున్నారు. ఆ నియోజకవర్గంపై ఆశలు పెంచుకుంటూ కార్యక్రమాలు చేపడుతున్న మరో నేతకు మంత్రి బొత్స సత్యనారాయణ ప్రత్యేకంగా క్లాసు తీసుకుని, కార్యక్రమాలకు స్వస్తి చెప్పాలని హితబోధ చేసినట్లు తెలిసింది. నరసన్నపేట నియోజకవర్గంలో ముఖ్య నాయకత్వం ఉన్నా జలుమూరు, సారవకోటలో అమసమ్మతి గోల రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణంగా వేసవిలో సన్ స్ట్రోక్ తగిలిందని అంటాం. కానీ ఆ నియోజకవర్గంలో రాజకీయంగా తనయుని స్ట్రోక్ తగులుతున్నట్లు తెలిసింది. 175 నినాదంతో నిర్వహిస్తున్న సర్వేలో తనయునికి తగిన బలం లేదని తెలిసిందని విశ్వసనీయ సమాచారం. వారసులకు టిక్కెట్లు ఇవ్వబోమని జగన్ గతంలో స్పష్టం చేసిన తర్వాతనే నేను ఇక పోటీ చేయను, కొడుకు పోటీ చేస్తారని చెప్పిన కృష్ణదాస్ ఇప్పుడు తానే పోటీ చేస్తానని పల్లవిని అందుకోవడం చూస్తున్నాం. శ్రీకాకుళం నియోజకవర్గంలో ధర్మాన ప్రసాదరావుకు సన్ స్ట్రోక్ బలంగా తగిలిందని ఆయన అనుయాయులు చెప్తున్నారు. ఆయన తనయుడు కూడా సర్వేలో వెనుకబడి ఉన్నారని అమరావతి వర్గాల భోగట్టా. ఆమదాలవలస నియోజకవర్గంలోనూ గ్రూపుల గోల ఉంది. ఒక ఆశావహునికి బొత్స క్లాసు తీసుకుని ఉపదేశించడంతో కాస్త వెనక్కి తగ్గినట్లు తెలుస్తున్నా, మరో ఆశావహునిలో ఆశ చావలేదని తెలిసింది. టిక్కెట్ రాకుంటే స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలో దిగవచ్చని ప్రచారం ఉంది. ఇక్కడా సర్వేల్లో ఆశావహుల కంటే తనయుడు వెనుకబడినట్లు తెలిసింది.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో గ్రూపుల గోల బలంగా ఉంది. ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కు కుటుంబసభ్యుల నుంచే పోటీ ఎదురవుతోంది. ఎచ్చెర్ల, లావేరు మండలాల నుంచి అసమ్మతి రాగం వినిపిస్తోంది. మొదట్లో ఎమ్మెల్యేలకు జగన్ హెచ్చరికలు చేసినా, అందరికీ టిక్కెట్లు మళ్లీ ఇస్తామని భరోసా ఇవ్వడం వెనుక గ్రూపుల గోల తగ్గుతుందని భావించినట్లుంది గానీ తగ్గలేదు. అభ్యర్థుల మార్పులు దాదాపుగా ఉండకపోవచ్చు. సంక్షేమ పథకాల అమలుతో కొన్ని కుటుంబాల్లో పల్లకి మోత ఉన్నా, వీధుల్లో ఈగల మోత వినిపిస్తోంది. చంద్రబాబు దుర్మార్గ పాలన చూసే ప్రజలు ఆ పార్టీని ఇంటికి పంపిన విషయాన్ని జగన్ గుర్తించినట్లు కనిపించడం లేదు. నేడూ అలాంటి పాలనే కొనసాగుతోంది. సమస్యల పరిష్కారానికి సాగిస్తున్న ప్రజా ఉద్యమాలపై నిర్బంధకాండ, అణచివేత చర్యలు కొనసాగుతున్నాయి. ఇరువురిలోనూ పాలనా వైఫల్యాలు బలంగా ఉన్నాయి. అందువల్ల వై నాట్ నినాదం చివరికి ప్రహసనంగా మారే అవకాశం లేకపోలేదు. జగన్ వైఫల్యాలు తమకు సానుకూలమవుతాయని టిడిపి అధినేతతో పాటు ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఆ భ్రమల్లో ఉన్నారు. పొత్తులతో బలం పెరుగుతుందని భావిస్తున్నారు. జనం నుంచి మాత్రం మళ్లీ చంద్రబాబే రావాలన్న మాట వినిపించడం లేదు. వై నాట్ నినాదం చివరికి ఎవరికి లాభిస్తుంది? ఎవరు ప్రత్యామ్నాయం అవుతారన్నది కాలమే నిర్ణయిస్తుంది.

- సత్తారు భాస్కరరావు

పరామర్శిస్తున్న రవికుమార్

వైసిపికి ఓటమి తప్పదు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

వచ్చే ఎన్నికలలో ఓటమి తప్పదని సర్వేలు స్పష్టం చేస్తుండడంతో ఓటమి భయంతోనే ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడుపైన, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పైన, మీడియా సంస్థల అధినేతలపైనా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విపరీత, అసత్య, అసందర్భ ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మండల కేంద్రంలో టిడిపి నాయకుల కుటుంబాలను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీఎల ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ముఖ్యమంత్రి స్థాయిని మరిచి దిగజారి విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ సంస్థతో పాటు పలు సర్వేలు వైసిపికి వ్యతిరేకంగా సర్వే రిపోర్టులు ఇస్తుండడంతో జీర్ణించుకోలేక విమర్శలకు దిగజారుతున్నారని అన్నారు. ఒకప్పుడు మాజీ ఎంపీ వివేకానంద హత్య కేసు నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు సిఐడితో తప్పుడు కేసులను టిడిపి నాయకులపై పెట్టిస్తున్నారని ఆరోపించారు. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రజల మద్దతు టిడిపికేనని స్పష్టం చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు రామ్మోహన్, తదితరులు ఉన్నారు.

'ఎన్‌ఇఆర్'కు కళా పరామర్శ

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

బిజెపి ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు తండ్రి అప్పలకొండ దొర ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, టిడిపి ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి కళావెంకటరావు నడుకుదిటిపాలెంలో ఎన్ఇఆర్ స్వగృహంలో ఆయనను శనివారం పరామర్శించారు. ముందుగా అప్పలకొండదొర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె లక్ష్మణరావు, టిడిపి నాయకులు లెంక శ్యామలరావు, పిసిని జగన్నాథంనాయుడు, డిజివి ఆనందరావు, ముక్కు ఆదినారాయణ, గురాన రామారావు ఉన్నారు. అలాగే టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు, సిఐ ఎస్.వేణుగోపాలరావు, కృష్ణంనాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె రాజగోపాల్, పిసిని జగన్నాథంనాయుడు, ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ కామినాయుడు, ఎడిటివి జిల్లా ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

పరామర్శిస్తున్న కళావెంకటరావు

వాలంటీర్లు సంక్షేమ సారథులు

నరసన్నపేట : వాలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

వాలంటీర్లు స్వచ్ఛందంగా పేదలకు సేవ చేస్తున్న సంక్షేమ సారథులని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 264 మందికి సేవ మిత్ర, ఐదుగురికి సేవా రత్న, ఒకరికి సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్ల సేవాభావం వల్ల అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల అరాచకాల వల్ల జనం నష్టపోయారని, కానీ ఇప్పుడు మాత్రం పింఛను, రేషన్ డోర్ డెలివరీ, బియ్యం కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు అదేశా వాలంటీర్ల సేవలు చేస్తున్నారని అన్నారు. 25 రకాల పథకాలకు వాలంటీర్లే బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు చింతు రామారావు, పంగ భావాజీనాయుడు, రాజాపు అప్పన్న, చీపురు కృష్ణమూర్తి, కోరాడ చంద్రభూషణ్‌గుప్తా, సర్పంచ్ బుర్లెల్లి శంకర్ పాగోటి రాజారావు, సురంగి నర్సింగరావు, దాలినాయుడు పాల్గొన్నారు.

రణస్థలం : వాలంటీర్లు వ్యవస్థ దేశానికి ఆదర్శమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాలకు సేవా మిత్రకు రూ.పది వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, సేవా వజ్రకు రూ.30 వేలు నగదుతో పాటు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి ప్రసాద్, ఎంపిపిలు మొదలవలస చిరంజీవి, బుట్ట అమ్మాజమ్మ, మండలాల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, మురళీధర్‌బాబా, మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల రమణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని ఆర్‌జె కళ్యాణ మండపంలో వాలంటీర్లకు వందనంలో భాగంగా సేవా వజ్రాలకు రూ.30 వేలు, సేవ రత్నాలకు రూ.20 వేలు, సేవా మిత్రాలకు రూ.పది వేలు చొప్పున నగదును, ప్రశంసాపత్రాలను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ చల్ల సుగుణ, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, మున్సిపల్ చైర్మన్ పిలక రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

జలుమూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన పేదలకు చేరవేయడంలో వాలంటీర్ల సేవలు మరువలేనివని వైసిపి రాష్ట్ర సిఇసి మెంబర్ ధర్మాన పద్మప్రియ అన్నారు. మండలంలోని పెద్దదూగాం, రాణ, రావిపాడు సచివాలయాల పరిధిలో ప్రజలకు సేవలు అందించిన వాంటీర్లకు సేవా మిత్ర అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో వాన గోపి, మండల కన్వీనర్ కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు బుక్క లక్ష్మణరావు, పెద్దదూగాం సర్పంచ్ తర్ర మాధవి భాస్కర్, ఎంపిడిఒ జి.వి.రవికుమార్ పాల్గొన్నారు.

పలాస : మండలంలోని మొగిలిపాడు సచివాలయంలో వాలంటీర్లను మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సన్మానించారు. కార్యక్రమంలో బమ్మిడి సంతోష్‌కుమార్, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ సీతారాం పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని గంగారం, యలమంచిలి, లఖందిడ్డి వాలంటీర్లకు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎంపిడిఒ కె.నిశ్చల వాలంటర్లకు వందనం కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేసి సన్మానించారు. కార్యాక్రమంలో సర్పంచ్‌లు పేడాడ జోత్న వెంకటరావు, బమ్మిడి పద్మ, కవిటి అమ్ములమ్మ, ఎంపిటిసి హనుమంతు గోవిందరావు, సింగుపురం వినోద్ పాల్గొన్నారు.

జలుమూరు : వాలంటీర్లను సన్మానిస్తున్న పద్మప్రియ

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న సాయిరాజ్

పలాస : వాలంటీర్‌ను సన్మానిస్తున్న గిరిబాబు

జీడి వ్యాపారులకు న్యాయం చేయాలి

పలాస : కాశీబుగ్గ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న జీడి వ్యాపారులకు కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, జీడి వ్యాపారులకు న్యాయం చేయాలని కాశీబుగ్గ ఇండస్ట్రియల్ ఏరియా జీడి పరిశ్రమ సంఘం అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు కోరారు. ఈ మేరకు పలాస ప్రగతి భవనంలో మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును శనివారం కలిసి జీడి పరిశ్రమ వ్యాపారులు తమ సమస్యయలను విన్నవించారు. ఈ సందర్భంగా రామేశ్వరరావు మాట్లాడుతూ 2006 నుంచి ఇండస్ట్రియల్ ఏరియాలో జీడి పరిశ్రమలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని, ప్రస్తుతం కాలుష్య నియంత్రణశాఖ అధికారులు వ్యాపారులకు ఇబ్బందులు పెడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రోస్టింగ్ విధానం ఉండదని, వాటిని పక్కనపెట్టి బాయిలింగ్ విధానంలో జీడి పిక్కలను కాల్చుతున్నామని చెప్పారు. ఇప్పుడూ జీడిపెక్కల నుంచి పొగ ఎక్కువగా వస్తుందని కాల్స్ నియంత్రణ అధికారులు వ్యాపారులకు నోటీసులు ఇస్తున్నారని, ఇలా అయితే తాము వ్యాపారాలు చేయడం కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు కూడా పట్టణానికి దూరంగా

సమస్యను మంత్రికి విన్నవిస్తున్న జీడి వ్యాపారులు

ఉన్నాయని, ఈ విషయం అధికారులకు తెలిసినా ఇబ్బందులు గురి చేయడం ఎంతవరకు సమంజసమని వాపోయారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కాలుష్య నియంత్రణ అధికారులతో మాట్లాడి అటు వ్యాపారస్తులకు ఇటు అధికారులకు ఇబ్బందులు తరతకుండా జీడి పరిశ్రమలో నిబంధనలు పాటించి బాయిలింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఇరువురికీ సముదాయించారు. మంత్రి కలిసిన వారిలో జీడి వ్యాపారులు శాసనపురి శ్రీను, టంకాల నాగ భూషణ్, పెంట శ్రీధర్, అచ్యుతరావు, రాజు పాల్గొన్నారు.

20 మంది రక్తదానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని తలసేమియా రోగుల అవసరార్థం లయన్స్ బ్లడ్ బ్యాంకులో అత్యవసరంగా రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని బ్లడ్ బ్యాంకు మేనేజరు కె.జశివకుమార్ పిలుపునిచ్చారు. తలసేమియా పిల్లలకు శ్రీకాకుళం లైన్స్ బ్లడ్ బ్యాంకు మదర్స్ లవ్ ఫౌండేషన్, మోహిత్ గుప్త ఫౌండేషన్ నారాయణ కళాశాల విద్యార్థులు 20 యూనిట్లు రక్తదానం చేశారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో తలసేమియా రోగులకు ఈ రక్తం యూనిట్లు అందజేశారు. కార్యక్రమంలో నారాయణ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు, ఎన్.జి.ఒ.సుప్రజ, ఐ.వి.ఆర్.హర్ష పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

మెమొంటోను అందజేస్తున్న 'జిల్' సభ్యులు

కలెక్టర్‌కు 'జిల్' అభినందనలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా రెడ్‌క్రాస్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీరు చేతుల మీదుగా బంగారు పతాకాన్ని ఇటీవల కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అందుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని నగరంలోని జిల్ ఫౌండేషన్ సభ్యులు కలెక్టర్‌ను శనివారం కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ ప్రియాంక, జిల్ ఫౌండేషన్ అధ్యక్షులు సత్య సాయి, ఉపాధ్యక్షులు జాడ సాయి, సెక్రటరీ కె.శివకుమార్, నంది, ఉమాశంకర్ పాల్గొన్నారు.

రేపు రిలే నిరాహార దీక్ష

పొందూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు పొందూరు తాలూకా యూనిట్ ఆధ్వర్యాన ఈ నెల 22న ఒక రోజు రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఎపిజిఇఎ పొందూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు పి.మోహనరావు తెలిపారు. సిపిఎస్ రద్దు, ప్రతినెలా 1న జీతభత్యాలు చెల్లింపు, డిఎస్‌సి ద్వారా నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయడం వంటి పలు అంశాలపై ప్రభుత్వ చర్యలకు ఈ రిలేదీక్షను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ఈ రిలే నిరాహార దీక్షకు ప్రభుత్వ ఉద్యోగులందరూ విధిగా హాజరుకావాలని కోరారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ జోగారావు

'ఉపాధి' పనులు పరిశీలన

సోంపేట: మండలంలోని పలాసపురం కొత్త చెరువుకు, జింకిబద్ర గ్రామానికి సాగు నీరు అందించే పైదిగాం ఛానల్‌లో ఇటీవల ఉపాధి పనులు చేపట్టారు. ఈ మేరకు సర్పంచ్ తడక జోగారావు సంబంధిత పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మేలు జరిగేలా ఉపాధి పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో రైతులు కోదండరావు, దున్న భైరి, బెందాళం రాజు, జి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

'శ్యామ్‌పిస్టన్స్' అధినేతకు నివాళి

రణస్థలం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక దిగ్గజం, శ్యామ్‌పిస్టన్ అండ్ రింగ్స్ లిమిటెడ్ గ్రూప్ అధినేత మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.డి.ఎం.రావు హైదరాబాద్‌లో శుక్రవారం మృతి చెందారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన రావు స్వశక్తితో మొదటిసారిగా హైదరాబాద్‌లో శ్యామ్‌పిస్టన్స్ పరిశ్రమను స్థాపించారు. దీనిద్వారా కొన్ని వందల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాపై ఉన్న మమకారంతో మొదటిసారిగా రణస్థలం మండలం వరిశాంలో పరిశ్రమను స్థాపించారు. ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలసి వద్ద మరో పరిశ్రమ స్థాపించి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. దీంతో ఆయా పరిశ్రమల్లో కార్మికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వేసి నివాళ్లర్పించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి ఆమదాలవలస సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి టౌన్ -1 ఫీడర్ పరిధిలో ఉన్న శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డు వెడల్పు పనుల కారణంగా పొడ వాటి స్తంభాలు అమర్చడం, కొత్త తీగలు వేస్తున్నామని అన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. అలాగే కృష్ణాపురం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మత్తులు చేపడుతున్నామని అన్నారు. నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం, కంచరవానిపేట, లంకాం, రైస్‌మిల్ అండ్ బ్రిక్ ఇండస్ట్రీ, కృష్ణాపురం, చంద్రయ్యపేట, శ్రీదేవి థియేటర్, లక్ష్మీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలందరూ గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

జలుమూరు: మండలంలోని చల్లబానిపేట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేనున్నట్లు టెక్కలి విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

లావేరు : పాతరౌతుపేటలో నేలకొరిగిన అరటి పంట

అకాల వర్షం... అపార నష్టం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

అకాల వర్షంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. శుక్రవారం రాత్రి వాతావరణంలో ఒకేసారి పెను మార్పులు చోటు చేసుకోవడంతో ఉరుములు, మెరుపులు పెద్ద పెద్ద గాలులతో పాటు వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి సుమారు రెండు గంటల పాటు పెద్దపెద్ద ఉరుములు శబ్దాలకు ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఉద్దానం ప్రాంతంలో ఈదురు గాలులకు మామిడికాయలు రాలిపోవడం, అరటి చెట్లు నేల కొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో రాత్రి 7 గంటలు నుంచి శనివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడ్డారు. విద్యుత్ సిబ్బంది రాత్రి నుంచి తీవ్రంగా కష్టపడి సరఫరాకు ఏర్పాటు చేశారు. బాతుపురం సమీపంలో చాలా ఏళ్ల నాటి పెద్ద వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో ప్రయాణికులు, వాహన దారులు అవస్థలు పడ్డారు. రాలిపోయిన మామిడి కాయలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించదని ఉద్యానవన శాఖ అధికారిని సునీత తెలిపారు.

60 ఎకరాల్లో అరటి పంటకు నష్టం

లావేరు : మండలంలో శుక్రవారం వీచిన పెనుగాలులకు, వర్షానికి 60 ఎకరాల్లో అరటి పంటకు అపరనష్టం వాటిల్లింది. మండలంలోని తామడ పంచాయతీ పాతరౌతుపేటలో 40 ఎకరాల్లో అరటి గెలతతో విరిగి నేల మట్టమైంది. లావేరులో మూడు, కేశవరాయపురంలో ఐదు, పెద్దలింగలవలసలో నాలుగు, లక్ష్మీపురంలో మూడెకరాలు చొప్పున అరటి పంట నేలమట్టమైంది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పెనుగాలకు, వర్షాలకు విరివిగిపోయి ఎందుకు పనికి రాకుండాపోవడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఉద్యనవన అధికారి ఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ నష్టపోయిన పంటను అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని తెలిపారు.

పథకాలను వినియోగించుకోవాలి

మంత్రి అప్పలరాజు

పలాస: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, వికలాంగులకు అనేక సంక్షేమ పథకాలు, పింఛన్లు అందజేస్తుందని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస ప్రగతి భవన్ ప్రాంగణంలో వికలాంగులకు రిట్రోఫిటెడ్ మూడు చక్రాల వాహనాలు, మోటరైజ్ వాహనాలు (స్కూటీలు) శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.12 లక్షల విలువైన 10 మూడు చక్రాల వాహనాలు లబ్ధిదారులకు అందజేశామని అన్నారు. ఈ వాహనాలు తీసుకున్న లబ్ధిదారులు ఆనందంగా వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు కె.కవిత పాల్గొన్నారు.

నమూనా కీని అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - పలాస

ప్రతిఒక్కరూ తన జీవన విధానాలను మార్చుకోవాలని, పర్యావరణాన్ని రక్షించాలని శ్రీకాకుళం కాలుష్య నియంత్రణ శాఖ ఎఇ కరుణశ్రీ అన్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు శ్రీకాకుళం కాలుష్య నియంత్రణ శాఖ ఇఇ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు పర్యావరణం పరిరక్షణపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం పలాస ఇందిరా గాంధీ చౌక్ వద్ద రోడ్డుపై పడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. ఎక్కువ శాతం ప్లాస్టిక్ వాడటం వల్లే పర్యావరణంలో మార్పులు చెందుతున్నాయని తెలిపారు. వాటి ప్రభావం మానవాళిపై పడుతుందని చెప్పారు. విద్యుత్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ఆహార పదార్థాలను వృథా చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో పిసిఎంఎ అధ్యక్షులు మల్లా సురేష్‌కుమార్, కార్యదర్శి కె.వి. శివకృష్ణ, కోశాధికారి పి.రవికాంత్, వైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మల్లా భాస్కరరావు, బెల్లాల నారాయణరావు, పెంట శ్రీను, టి.వెంకటరమణ, పెంట కిరణ్, కొంచాడ సతీష్, డోకి నాగేష్, వడ్డి నాగేష్, తాళాసు శ్రీను, పెంట మన్మథ పాల్గొన్నారు.

అలాగే పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలాస చైర్మన్ బల్ల

ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న కరుణశ్రీ

గిరిబాబు అన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆర్ఆర్ఆర్ కార్యక్రమానికి ప్రారంభించారు. నిరుపయోగకరమైన వస్తువులను పారవేసి పర్యావరణాన్ని పాడుచేయకుండా వాటిని మళ్లీ ఉపయోగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీతారాం, ఎఇ అవినాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాహుదా వంతెన పనులు ప్రారంభించాలి

మాట్లాడుతున్న రాజు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని బాహుదా నదిపై ఉన్న వంతెన తాత్కాలిక రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. వంతెన కూలిన రోజున దీక్ష చేపట్టామని అన్నారు. ఆ రోజు రాత్రి తహశీల్దార్, ఇచ్ఛాపురం టౌన్, రూరల్ ఎస్ఐలు కలెక్టర్ వస్తున్నారని దీక్షను విరమింపజేశామని పేర్కొన్నారు. తాత్కాలిక రహదారి సౌకర్యం కల్పించానికి రూ.40 లక్షలు నిధులు విడుదల చేశారని అన్నారు. తర్వాత వైసిపి నాయకుల సమక్షంలో 15 రోజుల్లో తాత్కాలిక రోడ్డు వేస్తామని చెప్పారని, 17 రోజులు అవుతున్నా ఎటువంటి కార్యాచరణ చేపట్టలేదని గుర్తుచేశారు. మరో వారం రోజులు లోపు యుద్ధప్రాతిపదికన తాత్కాలిక రోడ్డు పనులు ప్రారంభించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వార్డు ఇన్‌ఛార్జిలు దాసరి శేఖర్, రోకళ్ల భాస్కరరావు, పనపాన లింగరాజు, సంతోష్ బిసాయి, రుక్కు, దుర్యోధన్, డి.హేమసుందర్, వాసు, ఢిల్లీరావు, నాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఉన్న ఎపి మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)లో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో విద్యను అభ్యసించేందుకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఒబిసి, ఓసి, ఇడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.200లు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుంతో ఈ నెల 22 నుంచి జూన్ 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

నందిగాం: నందిగాం గణేష్ కాలనీకి చెందిన పాత్రో మల్లేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈయనకు వైఎస్ఆర్ బీమా వర్తించడంతో మృతుని భార్య పాత్రో చంద్రమ్మకు రూ.ఐదు లక్షలు మంజూరు పత్రాన్ని సర్పంచ్ జె.రమణమ్మ, మండల జెసిఎస్ కమిటీ చైర్మన్ జె.జయరాం శనివారం అందజేశారు. ఎస్.శ్రీనివాసరావు, వార్డు మెంబరు కె.వెంకట్, సంక్షేమ సహాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

పారాలీగల్ వాలంటీర్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని న్యాయసేవాధికర సంఘం ఆధ్వర్యాన పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్న్న ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ఆసక్తి కలిగిన పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, సేవా దృక్పథం కలిగిన ప్రభుత్వేతర సంఘ సభ్యులు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి అర్హత కలిగి పొందూరు, జి.సిగడాం మండలాల పరిధిలో నివాసితులై ఉండాలని తెలిపారు. అసక్తి కలిగిన వారు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తును ఈ నెల 22 సాయంత్రం 5 గంటల లోపు మండల న్యాయసేవాధికార సంఘం కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ పారా లీగల్ వాలంటీర్‌గా నియామితులైన వారికి ఎటువంటి పారితోషకం గాని, వేతనం గాని ఉండదని పేర్కొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని 18వ వార్డు బొడ్డేపల్లిపేట సమీపంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందగా, ఇద్దరు మహిళలకు తీవ్ర గాలయ్యాయి. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమడోలుకు చెందిన పిడిమి రాజులమ్మ తమ్ముడి వివాహానికి కన్నవారి గ్రామం కొర్లకోట ఇటీవల చేరుకుంది. శనివారం ఉదయం పెళ్లి సామగ్రి కొనుగోలు చేసే నిమిత్తం తోడికోడలు పిడిని మీనా జలుమూరు మండలం బుడితికి చెందిన పిన్ని కొడుకు చిలకలపల్లి మణికంఠ (23)తో కలసి ఆమదాలవలస వచ్చారు. సామగ్రిని కొనుగోలు చేసి తిరుగు ప్రయాణంలో పూజారిపేట మీదుగా కొర్లకోట వెళ్తున్న క్రమంలో బొడ్డేపల్లి పేట వద్ద పాలకొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మణికంఠ లారీ చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందగా, రాజులమ్మ, మీనాలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సహాయంతో క్షతగాత్రులను జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. రాజులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ. వై.కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి...

సరుబుజ్జిలి : మండలంలోని షళంత్రి పంచాయతీ పరిధిలోని యాసవాని చెరువులో పడి దిండి అప్పల రాము (53) మృతి చెందాడు. ఎల్ఎన్‌పేట మండలంలోని జాడపేటకు చెందిన రాము కొంతకాలంగా పెద్దసవలాపురం కూడలి వద్ద ఇల్లును అద్దెకు తీసుకొని భార్య ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో మృతుడు కాలకృత్యాలు నిమిత్తం చెరువుకు వెళ్లాడు. కాలు జారి చెరువులోకి వెళ్లిపోవడంతో ఈత రాక మునిగిపోయాడు. శనివారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాము (ఫైల్)

రైలు ఢీకొని వృద్ధుని దుర్మరణం

పొందూరు: పొందూరు-రాజాం రైల్వే బ్రిడ్జి కిందన గల రైల్వే ట్రాక్ పైన ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు (60) మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు చొక్కా, నీలం రంగు లుంగీ ధరించినట్లు పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన ఈ కింది ఫోన్ నంబరు 7013273731ను సంప్రదించాలని కోరారు.

నలుగురు అరెస్టు

లావేరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై రణస్థలం మండలం వి.ఎన్.పురానికి చెందిన ఆటోడ్రైవర్ బస్వ హేమంత్ అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆటోడ్రైవర్‌తో పాటు బాలికను తరలించేందుకు సహకరించిన మరో

వివరాలను వెల్లడిస్తున్న సిఐ ఆదాం

ముగ్గురిని శనివారం అదుపులోకి తీసుకున్నామని సిఐ ఎస్.ఆదాం, ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 10న ఆటోడ్రైవర్ బాలికకు మాయమాటలు చెప్పి విశాఖపట్నం తీసుకువెళ్లి అత్యాచారం చేసినట్లు బాలికతో పాటు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు చేశారని అన్నారు. మేరకు ఈ నెల 16న కేసు నమోదు చేశామని తెలిపారు. నాలుగు రోజుల పాటు విచారణ చేపట్టి శనివారం ఉదయం లావేరులో ప్రధాన నిందితుడు హేమంతో పాటు సహకరించిన బస్వ తాతారావు, బస్వ రామిరెడ్డి, ఎం.పవన్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని చెప్పారు. నిందితులను కోర్టుకు తరలించామని తెలిపారు.

రణస్థలం : ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- రణస్థలం

ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్ద పిషిణి, చిన్నపిషిణి తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏయే స్థాయిలో, ఏయే తరగతులకు చెందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, ఎంపిడిఒ ధనుంజయరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని చింతలపోలూరు, డేగలపోలూరు, చిన్ననీలాపురం, పుస్తెలార గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

రంగులు మార్చి ఇళ్ల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైసిపి ప్రభుత్వం పేదల కోసం సొంతింటి కల నెర వేరుస్తామని నమ్మబలికి సెంటు భూమిలో ఇళ్లు కట్టుకోమని చెప్పడం హాస్యాస్పదమని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెంటు స్థలంలో నిర్మిస్తున్న ఇంటిలో నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం ఎలా తలదాచుకోగలరని ప్రశ్నించారు. కేవలం ఇళ్ల నిర్మాణం పేరుతో వైసిపి నాయకులు రూ.వేల కోట్ల దోపిడీ చేశారని, ఆ తర్వాత ఇంటి నిర్మాణంపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా టిడ్కో ఇళ్లు నిర్మిస్తే... నాలుగేళ్ల తరువాత వైసిపి ప్రభుత్వం వాటికి రంగులు మార్చి తామే కట్టినట్లు ప్రచారం చేసుకుంటూ లబ్ధిదారులకు మళ్లీ పంపిణీ చేయడం సిగ్గుచేటని అన్నారు.

విద్యార్థికి ప్రవేశపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం లింగరాజు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.లింగరాజు అన్నారు. ఆరో తరగతి ప్రవేశాలకు పూండిలో విద్యార్థుల తల్లిదండ్రులను శనివారం కలిసి పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలోని వసతులు, విద్యాభివృద్ధి చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 580 మార్కులతో దట్టి హర్షవర్ధన్ మండలంలోని ప్రథమ స్థానంలో నిలిచాడని అన్నారు. 500 పై చిలుకు మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్నారని చెప్పారు. ఇప్పటివరకు చెరుకుపల్లి, పి.వి.పురం, గోవిందపురం పంచాయతీలో 34 మంది విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నమ్మిడి నరేంద్ర కుమార్, చింత హేమ, పొలాకి ఢిల్లీశ్వరరావు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో పైలాన్ మరమ్మతులు

ఇచ్ఛాపురం : మండలంలోని లొద్దపుట్టి వద్ద ప్రజా సంకల్ప యాత్ర ముగింపు సందర్భంగా నిర్మించిన విజయ స్తూపం (పైలాన్) మరమ్మత్తులు చేపట్టనున్నట్లు మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష హోదాలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మో హన్‌రెడ్డి చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ముగింపు చిహ్నంగా స్తూపాన్ని ఆవిష్కరించారని అన్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం పైలాన్‌ను ఆధునికీకరించి దిశగా రూ.25 లక్షలతో మరమ్మతులు, సుందరీకరణ చేస్తానని అన్నారు. పనులు నెలాఖరులోగా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

వెంకటరెడ్డి

ఘనంగా జూ.ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు

టెక్కలి రూరల్ : రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి- టెక్కలి/రూరల్

ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదాతలుగా ముందుకువచ్చి ప్రాణాన్ని రక్షించేవారవుతారని సుదర్శన థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ అన్నారు. జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు శనివారం సుదర్శన థియేటర్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం అన్నది అన్నింటి కన్నా మహా దానమని అన్నారు. ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు రక్త నిల్వలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కోట రాము, భాస్కరరావు పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో జూనియర్ ఎన్‌టి రామారావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. డ్యాన్సులు వేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. పలాసలో సింహాద్రి సినిమా ప్రత్యేక షో ప్రదర్శించారు. కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టి.శంకర్, వాసు, శివయ్య, చిన్నా పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని కోష్టలో మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథంనాయుడు ఆద్వర్యాన జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిటిసి భర్త పిసిని ఆసిరినాయుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు పైడి అప్పడుదొర పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక కళాంజలి థియేటర్ ఆవరణంలో జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని అభిమానులు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కాళ్లకూరి శాంతారాం, అభిమాన సంఘం అధ్యక్షులు ముద్దంశెట్టి ఏడుకొండలు, కళాంజలి థియేటర్ యజమాని గుడ్ల మోహన్, సోషల్ వర్కర్ పాలవలస శశికాంత్ జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు సత్యనారాయణ, చైతన్య, పవన్, డాక్టర్ బండారు పాత్రుడు పాల్గొన్నారు.

పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న అభిమానులు

పొందూరు : రక్తదానం చేస్తున్న యువకులు

ఇచ్ఛాపురం : ఎల్ మ్యాక్స్ సినిమా థియేటర్ వద్ద ఎన్‌టిఆర్ జన్మదిన వేకలు నిర్వహించారు. ఉదయం సింహాద్రి సినిమా స్పెషల్ షో వేశారు. కార్యక్రమంలో కొర్రాయి రమేష్, కాళ్ల జైదేవ్, జన్నెల సంతోష్, సందీప్, అశోక్, వినయ్, కాశీప్రసాద్, పైల నారాయణ పాల్గొన్నారు.

జెవికె కిట్లు పరిశీలన

బ్యాగును పరిశీలిస్తున్న కూర్మారావు

ఆమదాలవలస : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా జగనన్న విద్యా కానుక కిట్లను అందించనున్నట్లు మండల విద్యాసంక్షేమాధికారి, ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ దుప్పల రామారావు, ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యాన జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలందరికీ మూడు జతలకు సరిపడా యూనిఫాం క్లాత్, జత బూట్లు, రెండు జాతల సాక్షులు, బెల్టు, స్కూల్ బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్‌ను జూన్ 12 స్కూళ్ల ప్రారంభం నాటికి పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బడిఈడు పిల్లలు అందరినీ తప్పనిసరిగా పాఠశాలలకు పంపే ఏర్పాట్లు చేయించాలని సూచించారు. గతేడాది ప్రీ స్కూల్, అంగన్వాడీ కేంద్రాల్లో నమోదై ఉన్న పిల్లలందరినీ ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు అయ్యే విధంగా చూడాలన్నారు. అర్హత ఉన్న తల్లుల ఖాతాల్లో అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు ప్రభుత్వం జమ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు శైలజ, చంద్రకళ, జ్యోతి, ధనలక్ష్మి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రమణ పాల్గొన్నారు.

కొబ్బరి రైతుల జీవనోపాధుల మెరుగుకు కృషి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కొబ్బరి చెట్లు ఎక్కే కార్యక్రమంతో జీవనోపాధిని మెరుగుపరుచుకోవచ్చని కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఫ్రెండ్స్ ఆఫ్ కోకోనట్ ట్రీ వృత్తి శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొబ్బరి అభివృద్ధి సంస్థ ఆర్థిక సౌజన్యంతో ఆరు రోజులుగా శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. కొబ్బరి చెట్లు ఎక్కే కార్యక్రమంపై వృత్తి శిక్షణా కార్యక్రమాన్ని 20 మంది యువ రైతులతో నిర్వహించామని తెలిపారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్ మాట్లాడుతూ కొబ్బరి చెట్లు ఎక్కే ప్రక్రియను సులభతరం చేయడానికి ఈ శిక్షణ ద్వారా వృత్తిని సంపాదించుకోవచ్చు అని తెలిపారు. ఈ ఆరు రోజులు కొబ్బరి సాగు, రకాలు, చీడపీడలు వంటి అంశాలపైన, అలాగే బ్యాంకు అధికారుల ద్వారా సోషల్ సెక్యూరిటీ, ఇన్సూరెన్స్, సెంట్రల్ ఫైనాన్స్ ఎడ్యుకేషన్ వంటి విషయాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఇద్దరు మాస్టర్ ట్రైనర్లు రఘు, శ్రీను ఎత్తు గల కొబ్బరి చెట్లను ఏ విధంగా ఎక్కాలో రైతులకు నేర్పించారు. అనంతరం ప్రశంసాపత్రాలను అందజేశారు.

యంత్ర సాయంతో కొబ్బరి చెట్టు ఎక్కుతున్న రైతు

విద్యార్థులకు అభినందనలు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పాలిసెట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ కుమార్, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.లింగరాజు అభినందించారు. శనివారం వెలువడిన ఫలితాల్లో గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దట్టి హర్ష వర్ధన్ 93 మార్కులతో రాష్ట్రస్థాయిలో 1622 వర్యాంకు సాధించాడు. సందీప్ సాయి 3061, సాయి లిఖిత 4171 ర్యాంకులు సాధించారు. పాఠశాల ఆవరణలో నెల రోజులపాటు కళాశాల పాఠశాల అధ్యాపకులు ఉచితంగా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో 80 మంది పాల్గొన్నారు. వీరిలో చాలామంది పోలిసెట్‌కు అర్హతను సాధించడం సంతోషంగా ఉందని శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు రూపుసుందర్, ఉమారావు, కె.రాంబాబు, తిరుపతిరావు ఆనందం వ్యక్తం చేశారు.

డాక్టరేట్ పట్టాను స్వీకరిస్తున్న మోహనరావు

మోహనరావుకు డాక్టరేట్ ప్రదానం

శ్రీకాకుళం అర్బన్ : ప్రజలకు వైద్య సేవలు అందించడంలో లాభాపేక్ష చూడకుండా సేవలందిస్తున్న డాక్టర్ ఇంజరాపు మోహనరావుకు విశాఖపట్నం సెయింట్ పాల్స్ థియోలాజికల్ కళాశాల డైరక్టర్ డాక్టర్ కెవిఎన్ పాల్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కళాశాల స్నాతకోత్సవం విశాఖ నగరంలోని పబ్లిక్ లైబ్రరీలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవారంగానికి సంబంధించి ఆయనకు డాక్టరేటును అందజేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందని, దీంతో బాధ్యత మరింత పెంచిందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.వి.ఎన్.పాల్, చీఫ్ గెస్టు ప్రొఫెసర్ టి.శోభారాణి, గెస్టు ఆఫ్ హానర్ డాక్టర్ గొండు సీతారాం, డాక్టర్ వి.స్టీవెన్, ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.దేవప్రసాద్, డాక్టరేట్ గ్రహీత మోహనరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

ఎల్‌ఎన్‌పేట : మండలంలోని బొర్రంపేటకు చెందిన బలగ చిన్నారావు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు శనివారం పరామర్శించారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్త రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మాజీ ప్రధాన కార్యదర్శి కొవిలాపు కృష్ణమాచారి, మాజీ మండల అధ్యక్షులు యలమల గోవిందరావు, ఎఎంసి మాజీ చైర్మన్ కాగాన మన్మథరావు, అంపిలి పోలినాయుడు, ముగడ భద్రయ్య, కుంచాల బాలకృష్ణ పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని మాకన్నపురానికి చెందిన పొందూరు లక్ష్మణరావుకు ఎంఎన్‌ఆర్ సేవా సంస్థ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. లక్ష్మణరావు ఇటీవల కేన్సర్ వ్యాధికి గురై ఆస్పత్రిలో చేరాడు ఆపరేషన్ అనంతరం ఇంటికి చేరినా పనులు చేసుకోలేని పరిస్థితిలో ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న సంస్థ సభ్యులు రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, ఉలాల హరికృష్ణ, మల్లా కోదండరావ్, మడ్డు శంకర్, కె.తిరుపతి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

104ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా 104 ఎంఎంయు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వమే నిర్వహించాలని 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బి.లోకనాథం, జిల్లా అధ్యక్షులు నారాయణరావులు కోరారు. ఈ మేరకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. 104 విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులను ఆప్కాస్ పరిధిలో చేర్చి సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. జిఒ నంబరు 4459 ప్రకారం ఫిఎఫ్, ఇఎస్‌ఐ సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఎంప్లాయీస్ కాంట్రిబ్యూషన్ అరబిందో యాజమాన్యమే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కోశాదికారి సనపల నరేష్, ధనలక్ష్మి, బాలకృష్ణ, డ్రైవర్ డి.ఇ.వోస్ పాల్గొన్నారు.

వేళాపాళా లేని విద్యుత్ కోతలు

కోటబొమ్మాళి: అనదికార విద్యుత్ కోతలతో మండలంలోని ప్రజలు అల్లాడుతున్నారు. కొద్ది రోజులుగా రాత్రి, పగలు అని తేడా లేకుండా గంటల సమయం విద్యుత్ అంతరాయం కలుగుతుంది. ఒక వైపు ఎండవేడికి, ఉక్కబోతకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరానిలుపుదల చేయడంతో రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు. మరో దోమల బెడద, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇచ్చినట్టయితే తగు జాగ్రత్తలు తీసుకుంటామని వాపోతున్నారు.

మాట్లాడుతున్న వరలక్ష్మి, రామకృష్ణ

ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో ఎంపిడిఒ రవీంద్రబాబు మండలంలో ఉద్యోగంతో పాటు రాజకీయాలు చేస్తున్నారని పెద్దపేట సర్పంచ్ ఆనెపు వరలక్ష్మి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు రామకృష్ణ ఆరోపించారు. మండలంలోని పెద్దపేట తన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లడారు. పెద్దపేట పంచాయతీ పరిధిలో ఏడు గ్రామాల్లో 26 మంది అనర్హులని అర్హులుగా రాత్రికి రాత్రే తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి వృద్ధాప్య పింఛను పత్రాలు మంజూరు చేశారని అన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు ఉన్నత స్థాయిలో అధికారులంతా అర్హులకు అందాలని చెబుతుంటే... క్షేత్రస్థాయిలో దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వెంటనే ఉన్నత అధికారులు దర్యాప్తు చేసి తగిన చర్యలను తీసుకోవాలని కోరారు. లేకుంటే కోర్టుకు వెళ్తానని స్పష్టం చేశారు. ఎంపిడిఒతో పాటు పెద్దపేట సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్, కార్యదర్శి ప్రమేయం ఉందని అన్నారు.

1న సువార్త సభ

ఆమదాలవలస : ఏసుక్రీస్తు రక్షణ సువార్త సభ పోస్టర్ ఆవిష్కరణను మెండ విమలమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన స్థానిక షిలోహు ప్రార్థన మందిరం గేటులోని చిట్టెమ్మ కోటర్స్ వద్ద అధ్యక్షులు మెండ శామ్యూల్ శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 1న నిర్వహించనున్న ఏసుక్రీస్తు రక్షణ సువార్త సభ సంస్థ ఏడో వార్షికోత్సవం సందర్భంగా మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాడ విజయ్ కుమార్, జార్జ్ ముల్లర్, కృపావరం, శ్యామ్, కృపరావు పాల్గొన్నారు.